గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి

- బోర్లను అద్దెకిచ్చేందుకు ముందుకు రాని రైతులు
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

కొల్చారం(నర్సాపూర్): గ్రామాల్లో ఎండాకాలం రాకముందే తాగునీటికి కష్టాలు మొదలయ్యాయి. తండాల్లో నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్ లైన్లు చాలా చోట్ల తరచు పలిగిపోతుండడంతో మంచినీటి ట్యాంకులకు నీరు సరఫరా కాని పరిస్థితులు నెలకొన్నాయి. తాగునీటి అవసరాల కోసం సమీప పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుందామంటే అసలే పంటకు నీరు పారడం లేదంటూ, రైతులు వారిని వెనక్కు పంపిస్తున్నారు. దీంతో నీటి అవసరాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.

సంగాయిపేట గిరిజన తండాలో..

మండలంలోని సంగాయిపేట గ్రామపంచాయతీ గిరిజన తండాలో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. ఇక్కడ సరఫరా సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైప్‌లైన్ పొలాల వెంట తీసుకెళ్లడంతో చాలా చోట్ల పగిలిపోయి, ట్యాంకుల వరకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణ కోసం నాలుగు రోజుల క్రితం ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు తండాను సందర్శించి అక్కడి గిరిజనులతో చర్చించారు. రైతులు ఎవరైనా బోరును అద్దెకు ఇవ్వాలని కోరారు. దీంతో ఎవరు ముందుకు రాకపోవడంతో సంగాయిపేట గ్రామంలోని ప్రభుత్వ బోరు మోటార్ నుంచి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తండాకు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లి సరఫరా చేస్తున్నారు. రోజుకు రెండు మూడు టాకాలు తీసుకెళ్లా సరిపోవడం లేదంటూ అక్కడి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో తండాకు నీటిని అందించాలన్న మిషన్ భగీరథ పైప్‌లైన్

మరమ్మతులు వెంటనే చేపట్టితే నీటి ఎద్దడి నివారణకు అవకాశం ఉంటుందని తండవాసులు అంటున్నారు.



సీతారాం తండాలో నీటి కోసం పొలాల్లోని బోర్లను ఆశ్రయిస్తున్న తండావాసులు

సీతారాం తండాలో నీటి గోస..

సీతారాం తండాలో ఇదే పరిస్థితి నెలకొంది. ట్యాంకు సరఫరాయి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నప్పటికీ రక్షిత మంచిని ట్యాంకులకు మాత్రం నీరు సరఫరా కావడం లేదు. ఎనిమిది రోజుల్లో రెండు రోజులు మాత్రమే మీరు సరఫరా అయిందని తండావాసులు చెప్తున్నారు. ఇక్కడ ఎండాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఇదే పరిస్థితి. సింగిల్ ఫేస్ మోటార్లు ఉన్నప్పటికీ తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సంగాయిపేట తండాలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నాం



మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేసేప్పుడు సాంకేతిక సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు బోర్లను అద్దెకు తీసుకుందామన్న, ప్రస్తుతం వరి పంట ఎక్కువగా సాగు చేయడం, బోర్లను అద్దెకిచ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామ పంచాయతీ బోర్ల ద్వారా ట్యాంకర్‌ను ఉపయోగించి నీటిని సరఫరా చేస్తున్నాం. – లక్ష్మీనర్సింలు ఎంపీడీఓ, కొల్చారం

నీటి ఎద్దడి రాకుండా చూడాలి



తండాలో ఎండాకాలంలోనే నీటి ఎద్దడి అని ప్రత్యేకంగా ఏమీ లేదు. కాలం ఏదైనా నీటి ఇబ్బందులు ఉన్నాయి. మిషన్ భగీరథ నీళ్లు ఎప్పుడు వస్తాయో కూడా తెలియదు. అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు లేకుండా చూడాలి. – లాల్ సింగ్,సీతారాం తండా

క్లుప్తంగా

మండల బీజేపీ కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాలు ఇస్తున్న శ్రీకాంత్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని బీజేపీ కార్యవర్గంలో మార్పులు చేశామని బీజేపీ మండలాధ్యక్షుడు రామగొని శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం చిలప్‌చెడ్‌లో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశం, సత్యనారాయణ గౌడ్‌లను, ఉపాధ్యక్షులుగా శివకుమార్ గౌడ్, శివశంకర్‌లను, కార్యదర్శిగా మహేందర్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా నునావత్ రమేశ్‌లను నియమిస్తూ, వారికి నియమాక పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి నాగరాజు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు కిషన్‌నాయక్, నాయకులు నారాయణరెడ్డి, సిద్దిరాములు, రాజు, శేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరు గ్రామాల రైతులకు కౌన్సెలింగ్

సాగునీరు వదలాలని కోరిన అధికారులు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): చెన్నాయిపల్లి గ్రామ రైతుల పంటపొలాలకు శాలిపేట గ్రామ నల్లచెరువు నీరు వదిలి పంటలను కాపాడాలని ఇరు గ్రామాల రైతులకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం చిన్నశంకరంపేటలో తహసీల్దార్ మన్నన్, ఇరిగేషన్ డీ శ్రీనివాస్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేశం శాలిపేట, చెన్నాయిపల్లి గ్రామాల రైతులకు వేర్వేరుగా సాగునీరు వదలడంలో ఉన్న ఇబ్బందులపై చర్చించారు. పంటలకు కాపాడేందుకు నల్లచెరువు నీరు వదలాలని శాలిపేట గ్రామ రైతులను అధికారులు సముదాయించారు. తోటి రైతుల పంట నష్టం జరిగితే సహకరించాల్సింది పోయి నీరు వదలేందుకు నిరాకరించడం మంచిపద్ధతి కాదన్నారు. ఇరు గ్రామాల మధ్య ఉన్న వైరుధ్యం కూర్చుండి మాట్లాడుకోవాలని, సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ఆదివారం రాత్రి శాలిపేట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి నిర్ణయం చెప్తామని గ్రామపెద్దలు అధికారులకు మాట ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణగౌడ్, ఆర్ఐ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, శాలిపేట, చెన్నాయిపల్లి గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



జీడిపల్లిలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి గ్రామ యువత ఆదివారం 8వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి గ్రామంలోని మహంకాళి దేవాలయం వద్ద శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించి, చెత్త చెదారాన్ని తొలగించి డంప్‌యార్డ్‌కు తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాల 1998 – 99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వనం రిసార్ట్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంచనూరి రాజేశ్, గజవాడ రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్‌పై కేసు నమోదు

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసినందున మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ ఆంజనేయులుపై కేసు నమోదు అయినట్లు పట్టణ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే రోహిత్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఒక ప్రైవేట్ రైస్‌మిల్లు ఆదివారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా డయాగ్నోస్టిక్ సెంటర్ కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మారుతి, నసీరొద్దీన్, ముత్యం రెడ్డి, సత్యనారాయణరెడ్డి,యాదగిరి, నరేందర్, మహేశ్, రమేశ్, రవి, కిషన్,నాగరాజు, రవీందర్, సేనాపతి, వెంకటగౌడ్, లక్ష్మణ్ గౌడ్, రాజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పీఏసీఎస్ అభివృద్ధి

సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ ధర్మారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు, పీఏసీఎస్ సిబ్బంది, పాలకవర్గం సమష్టి కృషి చేస్తేనే పీఏసీఎస్ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏకైక పీఏసీఎస్ సోమక్కపేట్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి, సీఈఓ పోచయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం సహకార కేంద్రం లాభాలలోనే ఉందన్నారు. శీలాంపల్లి గేటు వద్ద రూ. 40 లక్షలతో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపుతో తీవ్రంగా నష్టపోయామన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించామని, త్వరలోనే పంపు తెరుస్తామన్నారు. గత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లతో రూ. 50 లక్షలు లాభం వచ్చిందని, రూ. 35 లక్షలు డిపాజిట్ చేయగా, మరో రూ. 15 లక్షలు సిబ్బంది వేతనాలు, కేంద్రం నిర్వహణకు వినియోగిస్తున్నామన్నారు. పురుగుమందు పిచికారికి పీఏసీఎస్ డ్రోన్‌లు తెప్పించి, రైతులకు అద్దెకు ఇవ్వాలని, అసైన్డ్ భూములకు రుణాలు ఇచ్చేవిధంగా తీర్మానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, డైరెక్టర్లు విఠల్, సుభాష్, సిబ్బంది నర్సింలు, రాజు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు ప్రారంభం



గంగకు వెళ్తున్న ఒగ్గు కళాకారులు, గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని తూజల్‌పూర్‌లో మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో గణపతి పూజ, స్వామివారికి అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఫౌండర్ గొట్టిముక్కుల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారుల ప్రదర్శనలతో గంగకు వెళ్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం స్వామివారి కల్యాణం, అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు ఉంటుంది. మంగళవారం నాగవెల్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కనులపండువగా బండ్ల ఊరేగింపు



తునికి నల్లపోచమ్మ జాతరలో బండ్ల ఊరేగింపు

భక్తులతో కిటకిటలాడిన తునికి నల్లపోచమ్మ ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో భక్తులు బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఆదివారం తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ బండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. గుమ్మటాల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం గుడారాలతో నిండిపోయింది. ఆలయం వద్ద ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, గ్రామస్తులు ఏర్పాటు చేశారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

టేక్మాల్ మండల కేంద్రంలో..

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో దుర్గమ్మ, పోచమ్మ గ్రామ దేవతల ఉత్సవాలు ఘనంగా కొనసాగున్నాయి. ఇందులో బాగంగా ఆదివారం అమ్మవార్లకు అబిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలతో పాటూ సాయంత్రం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పులతో, నృత్యాలు చేస్తూ బండ్లను ఊరేగిస్తున్నారు. డప్పు చప్పుళ్ల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాగణమంతా కిటకిటలాడింది. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.



జాతరలో భక్తులు

ఆలయాల్లో భక్తుల పూజలు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరీ అమ్మవారి దర్శనానికి భక్తులు పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తులు స్నానమాచరించి అమ్మవారి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సికింద్లాపూర్‌లో..

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కొనసాగుతోంది. అందులో భాగంగా ఆదివారం స్వామివారికి అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్ చారిలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, సిబ్బంది రామకృష్ణ, నర్సింహరెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



పెద్దశంకరంపేటలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



కౌడిపల్లిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం



పట్టణంలోని 15వ వారులోని సమస్యలను పరిశీలిస్తున్నమున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

తూప్రాన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కారించడమే తమ లక్ష్యం అని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 15వ వార్డులో వార్డు కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్‌తో కలిసి సమస్యలను గుర్తించారు. మున్సిపల్ సిబ్బందితో పడబడిన ఇళ్ల మట్టిని తొలగించడంతో డ్రైనేజీ సమస్యలను పరిష్కారించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని బోరుబావిలో నీటి నిల్వలు, మరమ్మతులను గమనించారు. పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులు, ప్రజల సంక్షేమానికి కృషి

కౌడిపల్లి(నర్సాపూర్): తనను ఎంపీగా గెలిపిస్తే పీవీఆర్ ట్రస్ట్‌ద్వారా రూ. 100కోట్లతో నిరుపేద విద్యార్థులు, ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తునికి నల్లపోచమ్మ జాతరలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాయిలపూర్ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రమాగౌడ్, ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా ప్రజలతో నాకు విడదీయరాని అనుబంధం ఉందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెదక్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



పరికరాలు అందిస్తున్న దాతలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో పలువురు సభ్యులు కలిసి క్రీడా ప్రాంగణానికి కొన్ని పరికరాలు అందజేశారు. ఈ మేరకు గ్రామంలో ఆరోగ్యమే మహాభాగ్యం ధ్యేయంగా గ్రామంలో కొంత మంది సభ్యులు, దాతల సహకారంతో ఆదివారం పలు పరికరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగా పుల్ – అప్ బార్, పుష్ – అప్ బార్, వాకింగ్ ట్రాక్ పరికరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీపీ స్వామి, మహేశ్, ప్రసాద్, ప్రశాంత్‌గౌడ్, తిర్మల్, తిరుపతిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, తిరుపతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలపై ఎక్సైజ్ దాడులు



రామాయంపేట తండాలో బ్యానర్ ప్రదర్శిస్తున్న ఎక్సైజ్ పోలీసులు



సదాశివనగర్ తండాలో తనిఖీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రామాయంపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆదివారం ఎక్సైజ్, జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పెద్ద సంఖ్యలో మండలంలోని పలు గిరిజన తండాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అటవీప్రాంతంలో ఉన్న సదాశివనగర్ తండా, కిషన్‌తండా, కోమటిపల్లి తండా, రామాయంపేట తండాల్లో తనిఖీ నిర్వహించి హెచ్చరికలు జారీచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తండాల్లో ఎవరైనా గంజాయి పండించినా, అమ్మినా తీవ్రమైన నేరంగా భావించి కేసులు నమోదు చేస్తామని మూడు శాఖల సీఐలు రాణి, వీణారెడ్డి హెచ్చరించారు. తండాలు, గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించవద్దని, గుడుంబా తయారు చేయవద్దని హెచ్చరించారు. రామాయంపేట తండాలో గంజాయి విక్రయించొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు విజయ్‌సిద్దార్థ, బాలయ్య అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నల్లపోచమ్మ విగ్రహానికి ఆర్థిక సాయం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కోసం మహ్మద్ రఫీ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ.. చందాయిపేటలోని నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కోసం ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు రూ.51 వేల ఆర్థిక సాయం అదించినట్లు తెలిపారు. చందాయిపేట నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

◆ నల్లపోచమ్మకు పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా గోపాల్

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా గడ్డం గోపాల్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ ముదిరాజ్ సంఘం, గ్రామ మత్స్యశాఖల నూతన కార్యవర్గాలను వేర్వేరుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా గడ్డం గోపాల్, ఉపాధ్యక్షుడిగా తంప్లూరి నర్సింలు, కార్యదర్శిగా భవాని సాయిబాబా, గ్రామ మత్స్యశాఖ అధ్యక్షుడిగా కాసాల శంకరయ్య, మత్స్యశాఖ ఉపాధ్యక్షుడిగా అందోల్ చిన్న నర్సింలు, మత్స్యశాఖ కార్యదర్శిగా భవాని కుమార్‌లను నియమించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఆ సంఘం సభ్యులతో పాటూ గ్రామస్తులు, యువకులు అభినందించారు.

◆ సిబ్బందిని అభినందించిన చైర్మన్

నర్సాపూర్: ఆస్తి పన్నును రికార్డు స్థాయిలో వసూలు చేయడం అభినందనీయమని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి రూ.మూడు కోట్ల 43లక్షల ఆస్తి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా 93శాతం వసూలు చేశామని మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ చైర్మన్‌కు వివరించారు. ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు చేసిన మేనేజర్‌తో పాటు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లను చైర్మన్ అభినందించారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

చేగుంట(తూప్రాన్): మండంలోని రుక్మాపూర్ గ్రామంలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, విగ్రహాల జలాధివాసం, పుష్పాదివాసం నిర్వహించారు. సహకార సంఘం చైర్మన్ పరమేశ్, ముదిరాజ్ సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ దళిత నాయకుడిపై దాడికి పాల్పడ్డవారిని అరెస్ట్ చేయాలి

రామాయంపేట(మెదక్): మండల కేంద్రంలో దళిత నాయకుడు కొమ్మాట బాబుపై దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రాజేందర్, సుధాకర్, సామార్తి రమేశ్, సంజీవ్‌కుమార్ ఆదివారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు.

◆ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామశివారులో ఉన్న పుష్పాల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఇసుక నింపడానికి వాగువద్ద ఉన్న మరో మూడు ఖాళీ ట్రాక్టర్లను సైతం వారు స్వాధీనపర్చుకొని రామాయంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణా విషయమై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ న్యాయం చేయాలి

నిజాంపేట(మెదక్): దళిత నాయకుడిపై జరిగిన దాడిలో న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకయ్యను తన స్వగృహంలో నిజాంపేట గ్రామ తాజా, మాజీ ఉప సర్పంచ్ కోమ్మాట బాబు కలిశారు. ఈ సందర్భంగా తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ శ్రీరాములు, సుధాకర్, ఎల్లం, పోచయ్య పాల్గొన్నారు.

◆ నవోదయకు విద్యార్థుల ఎంపిక

పెద్దశంకరంపేట(మెదక్): నవదోయ ఫలితాల్లో పెద్దశంకరంపేట మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం వెల్లడైన ఫలితాల్లో మండల పరిధిలోని శివాయిపల్లికి చెందిన విష్ణుసాయి, పేటకు చెందిన ప్రకాష్, సాత్విక్, క్రిష్ణల్, సంస్రిత, దుర్గాప్రసాద్, వర్షిత, కనిష్కుడు, గౌతమ్ తదితరులు నవోదయకు ఎంపికయ్యారు.

◆ ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలోని పద్మశాలీల బాంధవులు సాధనాసూరులు చేపట్టిన మంత్ర, తంత్ర మాయాజల ఇంద్రజాల ప్రదర్శన చూపరులను కట్టిసింది. పద్మశాలి సంఘం సౌజన్యంతో ఈ ఇంద్రజాల ప్రదర్శనను చేనేత సహకార సంఘం ఆవరణలో ప్రదర్శించారు.

◆ నేటి నుంచి కేవీకేలో సాంకేతిక వారోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రంలోఈనెల 1 నుంచి 8 వరకు సాంకేతిక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉద్యానవన శాస్త్రవేత్త, ప్రాజెక్టర్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు.